Andhra prabha Dt 30/10/17

సోమవారం 30 అక్టోబర్ 2017 ఆంధ్రప్రభ

# మియాపూర్ నుంచే మెట్రో పరుగు



- మెట్రో రూట్లలో ఆర్టీసీ ట్రయల్ రన్
- 24 స్టేషన్ల పరిధిలో అధికారుల సర్వే

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** హైదరాబాద్ నగరవాసులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న మెట్రో రైల్ ప్రారంభోత్సవానికి మియాపూర్ మెట్రో స్టేషన్ వేదిక అవుతోంది. నవంబర్ 28వ తేదీన ఇక్కడి నుంచి ప్రధాన నరేంద్రమోదీ వచ్చజెండా ఊపి మెట్రోను ప్రారంభించనున్నారు. మొదటి దశలో అమీర్‌పేట నుంచి నాగోల్, అమీర్‌పేట నుంచి మియాపూర్ వరకు మెట్రోరైల్ ప్రారంభంకానుంది. మొదటి కారిడార్‌లో మియాపూర్ కేంద్రంగానే మెట్రో రైల్ డిపోను సుమారు 105 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేశారు. డిపోతో పాటు మెట్రోస్టేషన్‌ను అత్యాధునిక మౌలిక వసతులతో ఏర్పాటు చేశారు. మొత్తం మెట్రో కారిడార్‌లోనే అత్యంత రద్దీ ఉండే మెట్రోస్టేషన్ మియాపూర్ నిలిచే అవకాశముంది. అందుకే ఐదు ఎకరాల స్థలంలో పార్కింగ్‌తో పాటు బస్‌బేలు, ఆటోబేలను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు మెట్రోరైల్ పరుగులు పెట్టడానికి ముందే 24 మెట్రో స్టేషన్ల నుంచి ప్రయాణికుల అవసరాల మేరకు బస్సులు నడపాలని ఆర్టీసీ భావిస్తోంది. దీనికి సంబంధించిన రూట్ మ్యాప్‌లను గ్రేటర్ ఆర్టీసీ అధికారులు సిద్ధం చేస్తున్నారు. మెట్రో కారిడార్లలో ప్రయాణికుల అవసరాల మేరకు ఆర్టీసీ బస్సులు ఏ సంఖ్యలో నడపాలనే దిశలో అధికారుల బృందం పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే మెట్రోస్టేషన్ సమీపంలోని కాలనీలు, బస్తీల్లో ప్రయాణికుల, స్థానికుల అభిప్రాయాలతో ఆర్టీసీ సర్వే నిర్వహిస్తోంది. సుమారు 16వేల మందికిపైగా ప్రయాణికుల నుంచి సర్వే రిపోర్టు సేకరించి బస్సుల సంఖ్యపై ఓ అంచనా వేస్తున్నారు.

## మెట్రోస్టేషన్ వద్ద ఆధునిక సదుపాయాలు

హైదరాబాద్ బైసైకిల్ క్లబ్‌తో కలిసి అద్దెకు సైకిళ్ళు అందుబాటులో ఉండాలా ఇక్కడే సైకిల్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ, హిందీ ఇలా మొత్తం నాలుగు భాషల్లో సమాచారాన్ని మెట్రో స్టేషన్ లోపల, రోడ్డు కింద భారంగా ఏర్పాటు చేశారు. ప్రతి మెట్రో స్టేషన్ ఉన్నట్లే ఇక్కడ నాలుగు మెట్రోమార్గాలు, రెండు లిఫ్టులు, రెండు ఎస్కలేటర్లు, ఏర్పాటు చేశారు. నవంబర్ 28న నగరంలోని హెచ్ఐసీసీలో జరిగే అంతర్జాతీయ వ్యాపార వేత్తల సదస్సుకు హాజరవుతున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా మియాపూర్‌కు చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోసం మియాపూర్ మెట్రో డిపోలో ప్రత్యేకంగా హెలిపాడ్‌ను సిద్ధం చేస్తున్నారు. కాగా ప్రధాని రాక నేపథ్యంలో మియాపూర్‌లో కేంద్ర, రాష్ట్ర భద్రతా బలగాలు ఇప్పటికే పలుమార్లు ఆ ప్రాంతాన్ని ప్రత్యేకంగా పరిశీలించాయి.

